సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

ఆదివారం । 7 । జూలై । 2024



డిగ్రీ పరీక్ష ఫలితాలు విడుదల
కేయూ పరిధి డిగ్రీ కోర్సుల ఆరో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను శనివారం వర్సిటీ అధికారులు విడుదల చేశారు.
- 8లో ▸



సహకార సంఘాల ద్వారా పురోగతి
సహకార సంఘాలతో ఆర్థిక పురోగతి సాధించవచ్చని టీఎస్ కో–ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అన్నారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
31°/24°

వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తుంది. సాయంత్రం వేళ ఆహ్లాదకరంగా ఉంటుంది.













మూగజీవాలతో సందడి
ప్రపంచ జూనోసిస్ డేను పురస్కరించుకుని శనివారం వడ్డేపల్లిలోని ప్రభుత్వ పశువైద్య కేంద్రం, వరంగల్‌లోని వెటర్నరీ క్లినిక్ కాంప్లెక్స్ ఆవరణ పెంపుడు జంతువులు, వాటి సంరక్షకులతో సందడిగా మారింది. పిల్లులు, కుక్కలు, కోతులకు వైద్యులు యాంటీ రేబిస్ ఇంజెక్షన్ చేశారు.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్లు వరంగల్/హన్మకొండ

న్యూస్‌రీల్

టీవీ, ఇంటర్నెట్ కేబుళ్లను తొలగించండి : సీపీ
వరంగల్ క్రైం: వరంగల్, హనుమకొండ, కాజీపేట ట్రాఫిక్ సిగ్నళ్ల స్తంభాలకున్న కేబుల్ వైర్లను తొలగించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రైసిటీ పరిధిలోని కాజీపేట జంక్షన్, వడ్డేపల్లి, అదాలత్, సీపీఓ, కేయూసీ, అశోక, ములుగు, ఎంజీఎం, పోచమ్మ మైదాన్ జంక్షన్లలో కొత్తగా ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ స్తంభాలకు ఉన్న కేబుల్ టీవీ, ఇంటర్నెట్ నిర్వహణకు సంబంధించిన కేబుల్స్‌ను మూడు రోజుల్లో తొలగించాలని పేర్కొన్నారు. నిర్ణీత గడువులోగా తొలగించకపోతే బల్దియా సిబ్బందితో తొలగిస్తామని హెచ్చరించారు.

ఇంజనీరింగ్ ప్రవేశాలకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్


కేయూ క్యాంపస్: తెలంగాణలో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు టీజీఎప్‌సెట్ అభ్యర్థులకు శనివారం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రారంభమైంది. ఈనెల 4నుంచి రిజిస్ట్రేసన్, స్లాట్ బుకింగ్ చేసుకుంటున్న అభ్యర్థులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేస్తున్నారు. 12 తేదీ వరకు రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చు. నగరంలోని నాలుగు హెల్ప్‌లైన్ సెంటర్లలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించారు. కాకతీయ యూనివర్సిటీలోని అడ్మిషన్ల డైరెక్టరేట్‌లో, హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో, కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, వరంగల్‌లోని ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో ఈ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. ఈనెల 13వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేసుకోవచ్చు. ఈనెల 8వ తేదీ నుంచి 15వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. 19వ తేదీన మొదటి దశ సీట్ల కేటాయింపు ఉంటుంది. 19 నుంచి 23 వరకు కేటాయించిన కళాశాలల్లో సీటు లభించిన అభ్యర్థులు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.జ్యోతి సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేసుకున్న అభ్యర్థులకు ధ్రువ పత్రాలు అందజేశారు. వరంగల్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్ అభ్యర్థులకు ధ్రువపత్రాలు అందజేశారు.

ముగ్గురి డీబార్
కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధి దూరవిద్య డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం నిర్వహించిన వివిధ పరీక్ష కేంద్రాల్లో కాపీయింగ్ చేస్తూ.. ముగ్గురు విద్యార్థులు డీబార్ అయినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి నరేందర్ తెలిపారు. అదేవిధంగా.. డిగ్రీ కోర్సుల బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీఒకేషనల్ బీసీఏ ఫైనలియర్ ఆరో సెమిస్టర్‌లో ఒక సబ్జెక్టు ఫెయిల్ అయిన విద్యార్థులకు త్వరలో ఇన్‌స్టంట్ పరీక్ష నిర్వహించనున్నట్లు ఎస్.నర్సింహాచారి తెలిపారు.

రైస్ మిల్లర్లతో సమావేశం
కాళోజీ సెంటర్ : బాయిల్డ్ రైస్, రా రైస్ మిల్లర్లతో వరంగల్ అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి కలెక్టరేట్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 2003–04 ఖరీఫ్, రబీ కస్టమ్ మిల్లింగ్ రైస్ డెలివరీ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. గతంలో డిఫాల్టర్లు 90 రోజుల గడువులోగా వంద శాతం డెలివరీ చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా మేనేజర్ సంధ్యారాణి పాల్గొన్నారు.

ఎంజీఎంపై సీరియస్

వైద్యుల తీరు, రోగుల ఇబ్బందులను తీవ్రంగా పరిగణించిన రాష్ట్ర ప్రభుత్వం

వరుసగా రెండో రోజు తనిఖీలు చేసిన వరంగల్ కలెక్టర్ శారదాదేవి

ఎంజీఎం తనిఖీలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ శారదాదేవి



- విభాగాల వారీగా వైద్యుల గైర్హాజరు పరిశీలన
- నెల రోజుల సంతకాలు చేసిన వైద్యుడి సస్పెన్షన్‌కు సిఫారసు
- సీఎం ఆదేశాలతో ఆకస్మిక తనిఖీకి వచ్చిన డీఎంఈ వాణి
- కలెక్టర్, ఆస్పత్రి అధికారులతో సుదీర్ఘ సమీక్ష

> సీఎం ఆదేశాలతోనే ఆస్పత్రికి వచ్చా. 9 గంటలకు రావాల్సిన వైద్యులు 8 గంటలకు బయోమెట్రిక్ చేయడం ఏంటి? అంటే వారు ముందుగా వచ్చి బయోమెట్రిక్ వేసి బయటికి వెళ్లిపోతున్నట్లు స్పష్టమవుతోంది. విధుల్లో నిర్లక్ష్యం చేస్తున్న వారిపై చర్యలు కచ్చితంగా ఉంటాయి.
>
> - వాణి, డీఎంఈ

> ఒక్కో విభాగంలో ఎంత మంది ప్రొఫెసర్లు, తోటి వైద్యులు ఉన్నారో తెలియని దుస్థితిలో ఆస్పత్రిలో వైద్యులు ఉన్నారు. మీతో పని చేస్తున్నది కూడా ఎవరో తెలియదా? ఈ రోజు ఎంత మంది రోగులకు వైద్య చికిత్సలు అందించారు? అనే ప్రశ్నకు సరైన సమాధానం చెప్పడం లేదు. విధుల పట్ల నిబద్ధత లేదనడానికి ఇదే నిదర్శనం.
>
> - సత్య శారదాదేవి, వరంగల్ కలెక్టర్

ఎంజీఎం: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో వైద్య సేవల నిర్లక్ష్యం, వైద్యుల గైర్హాజరు, అధికారుల మధ్య సమన్వయలోపంపై పెద్దఎత్తున వస్తున్న విమర్శలను రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. శుక్రవారం నర్సింగ్‌భవనాలు, ఆస్పత్రిలో సేవలను పరిశీలించిన కలెక్టర్ శారదాదేవి శనివారం కూడా ఆకస్మిక తనిఖీ చేశారు. వెంటనే నివేదికలు ఉన్నతాధికారులకు చేరవేస్తుండడం, పరిస్థితి సీరియస్‌గా ఉందన్న సమాచారంతో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) వాణి కూడా ఆకస్మికంగా తనిఖీకి వచ్చారు. ఆస్పత్రిలో రోగులు ఎదుర్కొంటున్న సమస్యల్ని తెలుసుకునేందుకు శనివారం ఉదయం 10:30 గంటల సమయంలో వరంగల్ కలెక్టర్ సత్య శారదాదేవి ఎంజీఎం ఆస్పత్రిలోని ఓపీ విభాగాన్ని పరిశీలించారు. ఓపీ చిట్టీలు ఇచ్చే గదులు, మెడిసిన్, సర్జరీ, ఈఎన్‌టీ, ఆర్థోపెడిక్, డెంటల్, సైకియాట్రిక్ ఇలా ప్రతీ ఓపీ విభాగాన్ని పరిశీలించారు. ఏయే ఓపీలో ఏ వైద్యులున్నారు. ఎవరు లేరు అనే విషయాన్ని అడిగి తెలుసుకుంటూ ముందుకు సాగారు. ఏరోజు ఏ ఓపీలో ఏ వైద్యులు ఉంటారో డ్యూటీ చార్ట్ అడిగితే తమ వద్ద లేదు అని పరిపాలనాధికారులు సమాధానమివ్వడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతీ విభాగంలో ఎంత మంది ప్రొఫెసర్లుండాలి? ఎంతమంది అసోసియేట్ ప్రొఫెసర్లు ఉన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఎక్కడున్నారు? మిగతా వైద్యులు ఎక్కడ అంటూ వైద్యులు ఉన్న వార్డుల వద్దకు వెళ్తూ.. స్వయంగా హాజరుశాతాన్ని పరిశీలించారు. అనంతరం రోగులకు రక్తపరీక్షలు నిర్వహించే రేడియాలజీ విభాగానికి వెళ్లి రోగులకు ఏయే రక్త పరీక్షలు జరుగుతున్నాయని తెలుసుకున్నారు. ఎంత మంది ప్రొఫెసర్లు హాజరయ్యారనే విషయాన్ని పరి శీలించారు. విధులకు హాజరైన వైద్యులు, ఎంత మంది రోగులు చికిత్స పొందుతున్నారు.. వార్డులో ఎంత మంది ఉన్నారంటూ ప్రశ్నిస్తూ వైద్యుల పనితీరును స్వయంగా పరిశీలించారు. రెండు గంటలకు పైగా విభాగాధిపతులతో ఎంజీఎం సమస్యలపై సమీక్ష నిర్వహించారు.

సస్పెన్షన్‌కు కలెక్టర్ సిఫారసు

విధులకు హాజరైన వైద్యులు, హాజరు కాని వారి వివరాల్ని రికార్డులు పరిశీలించి నివేదిక తయారు చేయాలని ఆర్‌ఎంఓలు, కలెక్టర్ కార్యాలయ సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. ఈక్రమంలో డాక్టర్ శ్యాం ప్రసాద్ జూలై నెల మొత్తం రిజిస్టర్‌లో సంతకాలు చేసి ఉండడం చూసి ఒక్కసారిగా అవాక్కయ్యారు. వెంటనే అతడిని సస్పెండ్ చేయాల్సిందిగా డీఎంఈకి సిఫారసు చేశారు.

నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్‌కు మందలింపు

నర్సింగ్ స్కూల్ భవనం శిథిలావస్థలో చేరింది. ఈక్రమంలో ప్రభుత్వ ఆదేశాలతో వేరే ప్రాంతానికి విద్యార్థులను తరలిస్తున్న క్రమంలో విద్యార్థులు అక్కడికి వెళ్లమని ఆందోళనకు దిగారు. ఇదే విషయమై నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఆందోళన చేసేలా ప్రేరేస్తున్నదెవరు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే విధంగా ఆయా ఓపీ విభాగాల్లో రద్దీని ఎప్పటికప్పుడు తగ్గించేలా సార్టింగ్ ఓపీ విధానాన్ని వెంటనే ప్రారంభించాలని ఎంజీఎం సూపరింటెండెంట్‌ను కలెక్టర్ సత్య శారదా దేవి ఆదేశించారు. రోగులు కూర్చునేలా బెంచీలు ఏర్పాటు చేయాలని, రోగులతో అసభ్యకరంగా ప్రవర్తించిన నర్సింగ్ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది వారి తీరు మార్చుకోకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టర్ వెంట అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓ కృష్ణవేణి, ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్, కేఎంసీ ప్రిన్సిపాల్ మోహన్‌దాస్, ఆర్‌ఎంఓలు మురళి, తహసీల్దార్ ఇక్బాల్ పాల్గొన్నారు.

ప్రతీ యూనిట్ ప్రొఫెసర్ ఓపీ విధులు నిర్వహించాల్సిందే : డీఎంఈ

వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) వాణి శనివారం అకస్మాత్తుగా సందర్శించారు. ఈసందర్భంగా కలెక్టర్ సత్య శారద, అధికారులతో కలిసి సమీక్షించారు. ఎంజీఎం ఆస్పత్రి తనిఖీలో వెలుగు చూసిన ఘటనలు, రక్తపరీక్షలు సేవలు పూర్తిగా లేకపోవడం, వైద్యుల గైర్హాజరు, పరిపాలనాధికారుల నిర్లక్ష్యంపై పూర్తిస్థాయి నివేదికలను డీఎంఈకి వివరించారు. డీఎంఈ వాణి మాట్లాడుతూ వైద్యులు నిర్లక్ష్యం వీడకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓపీ విధులు అసిస్టెంట్ ప్రొఫెసర్ ఒక్కరే కాదు.. అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ స్థాయి అధికారులు పర్యవేక్షించాల్సిందేనని విభాగాధిపతులకు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ ఇచ్చిన నివేదికను రాష్ట్ర ఉన్నతాధికారులకు అందించి చర్యలు చేపడుతామన్నారు. ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న ఆర్‌ఎంఓలకు పూర్తిస్థాయిలో అధికారాలు ఉంటాయన్నారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్ రోగులకు చికిత్సలు అందించే విభాగంలో ఉండాలని అధికారులు ఆదేశించారు.



ఎంజీఎంలో సమీక్ష నిర్వహిస్తున్న డీఎంఈ వాణి, కలెక్టర్ సత్యశారదా దేవి

కలగా 30 పడకల ఆస్పత్రి!

- దశాబ్దంన్నర కాలంగా ఎదురు చూపులు
- నామమాత్రంగా డిస్పెన్సరీ సేవలు



కాజీపేటలోని డిస్పెన్సరీ (ఇన్‌సెట్‌లో) దశాబ్దంన్నర కాలం కింద వేసిన శిలాఫలకం

కాజీపేట: ట్రైసిటీలో ఒకటిగా పిలవబడే కాజీపేటలో 30 పడకల ఆస్పత్రి ఏర్పాటు ఈ ఏడాదైనా జరగకపోతుందా? అనే ఆశతో ప్రజలు ఎదురుచూస్తున్నారు. రెండు లక్షలకుపైగా జనాభా ఉన్న పట్టణంలో మహిళా మెటర్నిటీ ఆస్పత్రి ప్రారంభానికి దశాబ్దంన్నర కాలం కిందట పునాది రాయి పడినా నేటికి అతీగతి లేకుండా పోయింది. గ్రేటర్ మున్సిపల్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో మహిళా మెటర్నిటి దవాఖాన ప్రారంభం కోసం రూ.60 లక్షలు మంజూరు కాగా.. అప్పటి అధికారులు పనులను వేగవంతం చేశారు. ఆస్పత్రి ఏర్పాటుకు అవసరమైన పనులన్నింటినీ పూర్తి చేసి అప్పటి ముఖ్యమంత్రి దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించడానికి శిలాఫలకం సిద్ధం చేశారు. అనూహ్యంగా వైఎస్సార్ మరణంతో ప్రారంభోత్సవం వాయిదా పడింది. ఇక ఆ రోజు నుంచి నేటి వరకు ఆస్పత్రి ఏర్పాటు ఎప్పుడెప్పుడా? అని ప్రజలు ఎదురు చూస్తూనే ఉన్నారు.

డిస్పెన్సరీతో చేతులు దులుపుకున్నారు..

ప్రజల డిమాండ్‌కు తలొగ్గిన అధికారులు దశాబ్దకాలం క్రితం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మున్సిపల్ సర్కిల్ కార్యాలయంలో డిస్పెన్సరీని ప్రారంభించి చేతులు దులుపుకున్నారు. అప్పటి నుంచి ఈడిస్పెన్సరీ పనితీరు నామమాత్రంగా మారడంతో రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అసలు పట్టణంలో ఒక ఆస్పత్రి ఉందనే విషయం పట్టణ ప్రజలకు కూడా తెలియని పరిస్థితి నెలకొంది.

శంకుస్థాపన చేసి ఆరేళ్లు..

2018లో అప్పటి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి చేతుల మీదుగా 30 పడకల ఆస్పత్రి పనులను లాంఛనంగా ప్రారంభించారు. పట్టణంతో పాటు వీలిన గ్రామాలు, చుట్టు పక్కల మండల ప్రజలకు వైద్యసేవలందించే లక్ష్యంతో ఆస్పత్రిని మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అతి త్వరలో కాజీపేటలో 30 పడకల ఆస్పత్రిని ఘనంగా ప్రారంభించుకుందామని గొప్పగా ప్రకటించారు.

సేవలు అంతంతే..

యథారాజా తథా ప్రజా అన్నట్లు డాక్టర్.. విధులకు అంతంత మాత్రంగానే హాజరవుతుండడంతో కింది స్థాయి సిబ్బంది వీలైతే రావడం.. కొద్దిసేపు కూర్చొని వెళ్లిపోవడం చేస్తున్నారు. సిబ్బందికి తీరినప్పుడు మాత్రమే విధులకు వచ్చిపోతుండడంతో రోగులను పట్టించుకునేవారు లేకుండా పోయారు. ఆస్పత్రిలో సరైన మందులు కొరవడ్డాయి. డాక్టర్ అందుబాటులో లేని కారణంగా ఓపీ సేవలు దాదాపుగా లేవనే చెప్పొచ్చు. ప్రతి నెలా రూ.6లక్షలకు పైగా జీతాలు తీసుకుంటున్న సిబ్బంది.. రోగుల సేవలను మరిచి సెల్‌ఫోన్లలో కాలక్షేపం చేయడంతోనే కాలం గడిచిపోతోందని రోగులు ఆరోపిస్తున్నారు. ఆస్పత్రికి రోగులు ఎప్పుడు వచ్చినా డాక్టర్ లేడనే సమాధానమే సిబ్బంది చెబుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పందించి పట్టణ ప్రజలకు చిరకాలవాంఛగా ఉన్న 30 పడకల మెటర్నిటీ ఆస్పత్రిని వెంటనే ఏర్పాటు చేసేలా చూడాలని పట్టణవాసులు కోరుతున్నారు.

30 పడకలు ఏర్పాటు చేయాలి..



కాజీపేట డిస్పెన్సరీకి శాశ్వత భవనంతో పాటు 30 పడకల మెటర్నిటీ ఆస్పత్రిని ప్రారంభించాలి. మహిళలు ఏ చిన్న సమస్య వచ్చినా హనుమకొండ లేదా వరంగల్ ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్తున్నారు.

- గద్దం నరహరి, ఆటో యూనియన్ నాయకుడు

మెరుగైన వైద్యం అందుతుంది..



పట్టణ ప్రజలు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న ఆస్పత్రి ఏర్పాటు కలను ఎమ్మెల్యే నాయిని సాకారం చేస్తారనే ఆశతో ఎదురు చూస్తున్నాం. దవాఖాన ఏర్పాటుతో పేద, మధ్య తరగతి ప్రజలకు మెరుగైన వైద్య చికిత్సలు అందుతాయి.

- యమడాల అనుకాంత్, కాజీపేట

పత్తికే ప్రాధాన్యం

ఆ తర్వాతే మిగతా పంటలు.. ఊపందుకోని వరి

హన్మకొండ: ఉమ్మడి వరంగల్ జిల్లాలో రైతులు పత్తి సాగుకే ప్రాధాన్యం ఇస్తున్నారు. మిగతా పంటలతో పోల్చుకుంటే.. ఇప్పటివరకు పత్తిని అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. ఇతర పంటలైన పప్పు దినుసులు, జొన్నలు, నువ్వులు వంటి పంటల వైపు కన్నెత్తి చూడడం లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో అన్ని పంటలు కలిపి సాధారణ విస్తీర్ణం 15,50,643 ఎకరాలు కాగా.. ఇప్పటి వరకు 5,37,043 ఎకరాల్లో సాగైంది. ఇందులో పత్తి సాధారణ విస్తీర్ణం 6,10,776 కాగా.. ఇప్పటి వరకు 4,27,763 ఎకరాల్లో సాగైంది. పత్తి తర్వాత మొక్కజొన్న రెండో స్థానంలో ఉంది. మక్క సాధారణ విస్తీర్ణం 73,087 ఎకరాలు కాగా.. ఇప్పటివరకు 25,797 ఎకరాల్లో సాగైంది. పప్పు దినుసులకు బాగా డిమాండ్ ఉన్నప్పటికీ రైతులు మాత్రం సాగు వైపు ఆసక్తి చూపడం లేదు. కంది సాధారణ విస్తీర్ణం 22,295 ఎకరాలు కాగా.. ఇప్పటి వరకు 5,121 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. వరి సాధారణ సాగు విస్తీర్ణం 8,03,182 ఎకరాలు కాగా.. ఇప్పటి వరకు 1,626 ఎకరాల్లో సాగు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురవకపోవడంతో వరి ఆలస్యమవుతోంది. భూగర్భ జలాలతో సాగు చేసుకునే రైతులు నార్లు పోసుకుని సిద్ధంగా ఉన్నారు. సాగునీరు అందుబాటులో ఉన్న మేరకు కొందరు రైతులు ముందుగా పోసుకున్న నారుతో నాట్లు వేస్తున్నారు. భారీ వర్షాలు కురిసి చెరువులు, కుంటల్లోకి నీరు చేరితేనే వరి సాగు ఊపందుకునే అవకాశముంది.



శాకంబరీ ఉత్సవ శోభ
వరంగల్ భద్రకాళి దేవాలయంలో శనివారం నుంచి శాకంబరీ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదటిరోజు అమ్మవారికి సహస్ర కలశాభిషేకం శోభాయమానంగా జరిగింది. భక్తులు పెద్దఎత్తున హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. - హన్మకొండ కల్చరల్

- వివరాలు 8లో ▸



అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకుడు భద్రకాళి శేషు, వరుసగా.. పాలాభిషేకం, చందనాభిషేకం, నేయాభిషేకం, పన్నీరు గులాబీ అభిషేకం, విబూదాభిషేకం, గంధాభిషేకం, చక్కరాభిషేకం,పెరుగాభిషేకం, గులాల్‌తో అభిషేకం, కుంకుమాభిషేకం - సాక్షి ఫొటోగ్రాఫర్, వరంగల్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ఖిలా వరంగల్ : వరంగల్ గవిచర్ల క్రాస్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఖిలా వరంగల్ మధ్య కోటకు చెందిన మహ్మద్ ఇబ్రహీం అలియాస్ నన్ను (45) లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో వ్యక్తిగత పని నిమిత్తం బైక్‌పై శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో గవిచర్ల క్రాస్‌కు బయలుదేరాడు. గవిచర్ల క్రాస్‌కు చేరుకోగానే బైక్‌ను కుక్క ఢీకొంది. దీంతో ఇబ్రహీం రోడ్డుపై పడడంతో తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఇబ్రహీంకు భార్య జక్య, తల్లిదండ్రులు ఉన్నారు. సమాచారం అందుకున్న మిల్స్‌కాలనీ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. మృతుడి భార్య జక్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అప్రమత్తత అవసరం..

సెకండ్ హ్యాండ్ వాహనాల కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలి
- రికార్డుల్లో పేర్లు చూడకపోతే అంతే..
- రవాణాశాఖ ఎంక్వైరీలో అనుమానాలు నివృత్తి చేసుకోవాలి

ఖిలా వరంగల్ : ప్రస్తుత రోజుల్లో అతి ముఖ్యమైన వాహనాలు బైక్, కారు. కిరాణం నుంచి.. ప్రయాణం వరకు ప్రతి అవసరానికి ఈ వాహనాలను వినియోగిస్తున్నాం. ఒక్క మాటలో చెప్పాంటే ఈ ప్రయాణ సాధనాలు లేకుండా అడుగు బయట పెట్టడం సాధ్య కాదని చెప్పడంలో అతియోశక్తి కాదేమో. ఈ క్రమంలో ఇంత ముఖ్యమైన వాహనాల కొనుగోళ్లలో ప్రజలు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. లేని పక్షంలో ఇబ్బందులు కొని తెచ్చుకోవాల్సిందే.

పుట్టగొడుగుల్లా పాతవాహన కన్సల్టెంట్లు..

వరంగల్ మహానగరంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న పాత వాహన కన్సల్టెంట్, షోరూంల్లో వాహనాలు కొనుగోలు చేసే సమయాల్లో వినియోగదారులు అప్రమత్తంగా వ్యవహరించాలి. సాధారణంగా కొత్త బైక్ కొంటే వాహనదారుడు పక్కాగా రిజిస్ట్రేషన్ చేయించుకుంటాడు. దీనిలో ఎలాంటి ఇబ్బందులు లేవు. అయితే సెకండ్ హ్యాండ్ బైక్‌లు, కారులు కొనుగోలు చేసుకున్నప్పుడు వాటి రికార్డులు, ఆర్‌సీబుక్, ఇన్సూరెన్స్, రోడ్డు టాక్స్ వంటి వాటిని చూడడం సర్వసాధారణం. ఈ క్రమంలో ఆయా జిల్లాల రవాణాశాఖ కార్యాలయంలో ఆ వాహనం ఎవరి పేరున ఉంది? దాని పరిస్థితి ఏమిటి? అనే విషయం తెలుసుకోలేకపోతే ఇబ్బందులు తప్పవు.



విక్రయానికి సిద్ధంగా ఉన్న బైకులు

దోపిడీలకు వినియోగించిన వాహనాల విక్రయం..

హత్యలు, దోపిడీలకు వినియోగించిన వాహనాలను కొంత మంది నేరగాళ్లు గుట్టుచప్పుడు కాకుండా ఇతర జిల్లాలో విక్రయిస్తారు. వాటిని కొనుగోలు చేసిన అమాయకులు చిక్కుల్లో పడే పరిస్థితులు అక్కడక్కడ కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రవాణాశాఖ.. వాహనాలకు సంబంధించిన డేటా మొత్తం ఆన్‌లైన్‌లో పొందుపర్చింది. దీంతో వాహనం కొనుగోలు చేసే ముందు ఆర్టీఏ, ట్రాఫిక్ అధికారులను సంప్రదించి కేసుల వివరాలు సేకరించి సెకండ్ వాహనాలు కొనుగోలు చేయాలని అధికారులు తెలుపుతున్నారు. తెలంగాణ ట్రాన్స్‌పోర్ట్ వెబ్ సైట్‌ను ఓపెన్ చేసి వాహనం నంబర్ ఎంటర్ చేయగానే పేరు, అడ్రస్ ఇతర వివరాలు కనిపిస్తాయి. వాటి ఆధారంగా బైక్ లేదా కారు ఎక్కడైనా చోరీకి గురికాగానే వాహనదారుడి పేరు, ధ్రువీకరణ పత్రం, ఇన్సూరెన్స్ పత్రాల పరిశీలనతోనే తెలిసిపోతుంది. ధ్రువీకరణ పత్రాలు ఎక్కడైనా మార్ఫింగ్ జరిగినట్లు అనిపిస్తే వెంటనే ఆర్టీఏను సంప్రదిస్తే వాహన వివరాలు పొందొచ్చు. అతివేగంగా వాహనాలు నడిపిన వారికి, ప్రమాదం చేసి తప్పించుకుని తిరుగుతున్న వాహనాల వివరాలు కేసు నమోదును బట్టి తెలిసిపోతుంది. ఏదీ ఏమైనా సెకండ్ వాహనం కొనుగోలు చేసే సమయంలో వినియోగదారులు జాగ్రత్తలు పాటించకుంటే కష్టాలు తప్పవని రవాణాశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. వాహనం కొనుగోలు చేసే ముందుకు ఆర్టీఏ, ట్రాఫిక్ అధికారులను సంప్రదించాలని వారు సూచిస్తున్నారు.

పత్రాలు సరిచూసి కొనుగోలు చేయాలి



సెకండ్ హ్యాండ్ వాహనం కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలి. ధ్రువీకరణ పత్రాలు సరిచూసిన వెంటనే ఆర్టీఏ కార్యాలయాన్ని సంప్రదించి వాహన వివరాలు తెలుసుకోవాలి. వాహన రిజిస్ట్రేషన్‌తో పేరు మార్పిడి జరుగుతుంది. వాహనం విక్రయించే వారు వెంటనే కొనుగోలుదారుడి పేరు మీద రిజిస్ట్రేషన్ చేయాలి. వాహనం కొనాలన్నా, విక్రయించాలన్నా ఆర్టీఏ నిబంధనలు పాటించాలి.

- జైపాల్‌రెడ్డి, ఎంవీఐ, వరంగల్ ఆర్టీఏ

గ్రామపంచాయతి కార్యాలయము - రఘునాథపల్లి
మం॥ రఘునాథపల్లి, జి॥ జనగాం

ఆర్.సి.నెం. జి.పి.ఆర్./26/2024 తేది : 02-07-2024

అంగడి వేలం ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా! జనగాం జిల్లా రఘునాథపల్లి మండలము, రఘునాథపల్లి గ్రామ పంచాయతికి సంబంధించిన ప్రతి గురువారం నిర్వహించబడు అంగడి తైబజార్ పశువులు, గొర్రెలు, మేకలు రహదారి సంత బహిరంగ వేలము 2024-2025 సంవత్సరమునకు గాను గ్రామ పంచాయతి కార్యాలయము, రఘునాథపల్లి యందు తేది : 10-07-2024 బుధవారం రోజున ఉదయం గం॥ 9.30 ని॥ల నుండి 11.30 ని॥ల వరకు శ్రీయుత డివిజనల్ పంచాయతి అధికారి, జనగామ గారు మరియు విస్తరణాధికారి (DLPO & MPO) గారిచే కాని వారిచే అనుమతి పొందిన వారిచే గాని బహిరంగ వేలం వేయబడును. ప్రభుత్వం నిర్ణయించిన ధర బహిరంగ వేలము నిర్వహించబడును. మొదటి రోజు ప్రభుత్వం నిర్ణయించిన అఫ్‌సెట్ ప్రైజ్ రానిచో తిరిగి మరల బహిరంగ వేలము నిర్వహించబడును.

ఇట్టి వేలములో పాల్గొనువారు ఈ దిగువ నియమ నిబంధనలకు లోబడి పాల్గొనవలెను. అంగడి కాంట్రాక్టు ఒక సంవత్సరము అనగా తేది :11-7-2024 నుండి 31-3-2025 వరకు అమలులో యుండును. ఏ కారణము చూపకనే వేలము పాట నిలుపుదల చేయు అధికారము గ్రామ పంచాయతీకి కలదు.

నియమ నిబంధనలు :

1. వేలములో పాల్గొను వారు తేది :09-07-2024 మంగళవారం సాయంత్రం 5-00 లకు రూ. 1,50,000/- ఒక లక్ష రూపాయలు బ్యాంకు డి.డి. పంచాయతి కార్యదర్శి, గ్రామ పంచాయతి, రఘునాథపల్లి గారి పేరున SBI ఖిలాషాపురం. APGVB రఘునాథపల్లి బ్రాంచ్ నందు చెల్లు విధముగా తీసి ఇంటి విలువ / భూమి విలువ సర్టిఫికెట్‌లు జత చేసి (ROR Pass Books అంగీకరించబడవు) కార్యాలయంలో సమర్పించవలెను.
2. మొదటి రోజు ప్రభుత్వం నిర్ణయించిన అఫ్‌సెట్ ప్రైజ్ రానిచో తిరిగి మరల బహిరంగ వేలము నిర్వహించబడును.
3. వేలములో పాల్గొనువారు వారి పేరున గల ఇల్లు ఉన్నచో రూ॥ 1,50,000/- ఒక లక్ష కలిగియున్నట్లు ఇంటి విలువ ధృవపత్రము పంచాయతి కార్యదర్శి గారి సంతకంతో ఇతర మండలములలోని గ్రామపంచాయతిల విషయంలో (MPO) గారితో అటెస్ట్ చేయించినది సమర్పించవలెను. లేదా వ్యవసాయ భూమి అయినచో రూ॥ 1,50,000/- విలువ కలిగినది శ్రీయుత తహసీల్దార్ గారిచే ధృవీకరించిన భూమి విలువ ధృవ పత్రము గ్రామపంచాయితీలో దాఖలు పర్చగలరు.
4. కాంట్రాక్టు దారుని పాట మొత్తంలో 1/4 వంతు పోగా మిగిలిన సొమ్మును 9 సమాన కిస్తులతో చెల్లించుటకు ప్రతి నెల 18 జూలై-2024 నుండి 18 డిసెంబర్-2025 వరకు చెల్లించుటకు 9 పోస్టు డేట్ చెక్కులు సంతకాలు చేసి పంచాయితీ కార్యదర్శి రఘునాథపల్లి గారి పేరిట 15-7-2024 లోగా ఇవ్వవలెను.
5. బహిరంగ వేలంలో పాల్గొనువారు రూ. 2000/- డిపాజిట్ గ్రామ పంచాయతి కార్యాలయంలో చెల్లించి వేలంలో పాల్గొనగలరు.

సం/- శ్రీమతి బి. కవిత
పంచాయతి కార్యదర్శి
గ్రా.పం.: రఘునాథపల్లి, సెల్: 9398528190

శ్రీ వై. రాజేందర్ రెడ్డి
స్పెషల్ ఆఫీసర్
గ్రా.పం.: రఘునాథపల్లి, సెల్: 9100115739

డిగ్రీ ఆరో సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదల

- 50.10శాతం మంది విద్యార్థుల ఉత్తీర్ణత

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఈఏడాది ఏప్రిల్-మేలో నిర్వహించిన డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ, బీబీఏ, బీవొకేషన్ కోర్సుల ఆరో సెమిస్టర్ పరీక్షల ఫలితాలు శనివారం సాయంత్రం రిజిస్ట్రార్ పి. మల్లారెడ్డి.. పరీక్షల నియంత్రణాధికారి ఎస్. నర్సింహాచారితో కలిసి విడుదల చేశారు. యూనివర్సిటీ పరిధిలో మొత్తం డిగ్రీ కోర్సుల ఆరో సెమిస్టర్ పరీక్షలకు 46,130మంది విద్యార్థిని, విద్యార్థులు హాజరుకాగా అందులో 23,114మంది విద్యార్థులు ఉత్తీర్ణత(50.10శాతం) సాధించారని పరీక్షల నియంత్రణాధికారి ఎస్. నర్సింహాచారి తెలిపారు. బాలురు 22,355మంది పరీక్షలకు హాజరుకాగా 8,465మంది ఉత్తీర్ణత(37.87శాతం) సాధించారు. బాలికలు 23,784 మంది పరీక్షలు రాయగా అందులో 14,649మంది ఉత్తీర్ణత (61.59శాతం) సాధించారు. ఉత్తీర్ణతలో బాలురకంటే బాలికలదే పైచేయిగా ఉంది. కార్యక్రమంలో అదనపు పరీక్షల నియంత్రణాధికారులు తిరుమలాదేవి, ఎ. నరేందర్, బీఎస్ఎల్ సౌజన్య, క్యాంపు ఆఫీసర్ ఆసిం ఇక్బాల్, క్యాంపు బాధ్యులు సమ్మయ్య పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలవారీగా ఫలితాలు..



ఫలితాలను విడుదల చేస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి, పరీక్షల విభాగం అధికారులు

కేయూ పరిధిలో డిగ్రీ ఆరో సెమిస్టర్ల పరీక్షల ఫలితాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 18,881మంది విద్యార్థులకుగాను 9,657 మంది ఉత్తీర్ణత(51.15) సాధించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 11,809 మంది విద్యార్థులకుగాను 6,352మంది ఉత్తీర్ణత (53.79శాతం) సాధించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 15,449మంది విద్యార్థులకుగాను 7,105మంది ఉత్తీర్ణత (45.99శాతం) సాధించారు. పరీక్షల ఫలితాలు సంబంధిత వెబ్ సైట్‌లో అందుబాటులో ఉంచారు.

రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులు చేసుకోవచ్చు

డిగ్రీ ఆరో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను విడుదల చేసిన నేపథ్యంలో విద్యార్థులు రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులు చేసుకునే అవకాశం కల్పించారు. ఈనెల 7వ నుంచి 22వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు.

జెడ్పీ స్పెషల్ ఆఫీసర్‌గా కలెక్టర్ బాధ్యతల స్వీకరణ

వరంగల్: వరంగల్ జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారిగా కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి బాధ్యతలు స్వీకరించారు. జెడ్పీ చైర్మన్ల పదవీ కాలం గురువారంతో ముగిసింది. దీంతో జెడ్పీ ప్రత్యేక అధికారిగా కలెక్టర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్‌ను సీఈఓ రాంరెడ్డి శనివారం మర్యాద పూర్వకంగా కలసి మొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు. జెడ్పీ సూపరింటెండెంట్ ఉదయభాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

- వివరాలు వెల్లడించిన ఏసీపీ నందిరాంనాయక్

రామన్నపేట : వరంగల్ బట్టలబజార్ వెంకటేశ్వరస్వామి దేవస్థానం పక్క గల్లీలో ఈ నెల 1వ తేదీన జరిగిన కూలీ హత్య కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ తెలిపారు. శనివారం మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ గోపితో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏసీపీ వివరాలు వెల్లడించారు. వరంగల్ శివనగర్ వందన హైస్కూల్ వద్ద నివాసముండే ఇంగిల్కర్ రవీందర్.. వరంగల్ బస్టాండ్ వద్ద ఆంధ్రాహోటల్‌లో పనిచేసే వాడు. హోటల్‌లో పని మానేసిన అనంతరం యాచిస్తూ వెంకటేశ్వర స్వామి దేవాలయం దగ్గర నిద్రించేవాడు. అక్కడ అతడితో పాటు ఓ మానసిక దివ్యాంగురాలు నిద్రించేది. ఈ క్రమంలో 30వ తేదీ రాత్రి వీరభద్రచారి మద్యం సేవించి రాత్రి 12.30 గంటల సమయంలో మానసిక దివ్యాంగురాలు ఉన్న ప్రాంతం వద్ద నిద్రించాడు. ఆ సమయంలో రవీందర్ అక్కడికి చేరుకుని 'నువ్వు ఇక్కడ మహిళ పక్కన ఎందుకు పడుకున్నావు' అని వీరభద్రచారితో గొడవపడ్డాడు. ఈ గొడవలో వీరభద్రచారిని సీసీ రోడ్డుపై పడేశాడు. వెంటనే అక్కడ ఉన్న రాయితో తలపై మోదీ చంపేసి అక్కడి నుంచి పారిపోయాడు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టి నిందితుడు రవీందర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. ఎస్సై నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నందిరాంనాయక్

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

గూడూరు: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని మర్రిమిట్టలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎస్కే. గుంషావళి (52) భార్య కైరుతో కలిసి కూలి చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ దంపతులకు ఒక కూతురు, కుమారుడు ఉండగా వారికి పెళ్లిలు అయ్యాయి. కాగా, ఇటీవల గుంషావళి.. భార్యతో నిత్యం గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం భార్య ఇంటి ముందు ఉండగా గుంషావళి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొద్ది సమయం తరువాత ఇంట్లోకి వెళ్లిన భార్యకు భర్త వేలాడడం చూసి కేకలు వేసింది. ఆమె కేకలు విన్న పక్కింటి వారు వెళ్లి చూడగా అప్పటికే గుంషావళి మృతిచెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



గుంషావళి (ఫైల్)

శోభాయమానం.. సహస్ర కలశాభిషేకం



ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

- భద్రకాళి ఆలయంలో శాకంబరీ ఉత్సవాలు
- ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ కల్చరల్ : శ్రీభద్రకాళి దేవాలయంలో శాకంబరీ నవరాత్రి ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా అమ్మవారికి సహస్ర కలశాభిషేకోత్సవం శోభాయమానంగా జరిగింది. ఉత్సవ కార్యక్రమాలు ఉదయం 4 గంటల నుంచి ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో నిర్మాల్యసేవలు అమ్మవారికి నిత్యాహ్నికం, క్షీరాన్న నివేదన, ఉత్సవానుజ్ఞప్రార్థన, గౌరి గణపతిపూజ, పుణ్యాహవచనం, మాతృకాపూజ, నాందీ, ఆయుష్యమన్త్రజపం, బ్రహ్మకూర్చహవనం, పంచగవ్యప్రాశనం, ఋత్విక్‌గ్వరణము, మధుపర్కవిధి, ప్రతిసరబంధము, వాస్తుయాగం, పర్యగ్నీకరణం, మత్సంగ్రహణం, వర్ధనీపూజ, యాగశాల ప్రవేశము, భూతోత్సాదనం, మండప స్థాణపూజ, ద్వారాతోరణపూజ, ధ్వజారోహణం, కర్కరీస్థాపనం, బలిప్రధానం, కుండసంస్కారం, అగ్నిప్రతిష్ఠ, సర్వతోభద్రవాస్తుయోగినీ, గణపతి నవగ్రహ క్షేత్రపాలమండలదేవతాయజనం నిర్వహించి కలశస్థాపన చేశారు.

ఉత్సవాలను ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి..

హనుమకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, నీలిమ దంపతులు అమ్మవారి సన్నిధిలో జ్యోతిప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఈఓ శేషుభారతి, భద్రకాళి శేషు, అర్చకులు.. రాజేందర్‌రెడ్డి దంపతులను పూర్ణకుంభంతో స్వాగతించారు. ఎమ్మెల్యే ఆదిశంకరులను, వల్లభగణపతిని, అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు ఎమ్మెల్యేకు శేషవస్త్రాలు మహాదాశీర్వచనం అందజేశారు. అనంతరం రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఓరుగల్లును ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. ఆలయ మాడవీధుల నిర్మాణానికి గతంలో ఇచ్చిన రూ. 30కోట్లు, అదనంగా రూ. 70కోట్లతో భద్రకాళి దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి అదనపు నిధులు మంజూరు చేయాలని కోరగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి, సురేందర్, రెడ్‌క్రాస్ సంస్థ ఉపాధ్యక్షులు ఈవీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

భద్రకాళి శరణంమమ..

సహస్రకలశాభిషేకం మధ్యాహ్నం ప్రారంభమైంది. అగ్నిపురాణంలో చెప్పబడిన విధంగా వేదపండితులు నాలుగు వేదాల మూలమంత్రాలు పఠిస్తుండగా భక్తులు భద్రకాళి శరణంమమ అంటూ చదువుతుండగా అమ్మవారికి అభిషేకం శోభాయమానంగా జరిగింది. దేవాలయ అర్చకులు అభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు. శీతలోదకం, ఉష్ణోదకం, పాలు, పెరుగు, నెయ్యి, తేనే, చక్కెర,కొబ్బరి నీళ్లతో అభిషేకం జరిపారు. ఆ తరువాత మండలంలోని తొమ్మిది కోష్టాలలో మూలమంత్రాలతో తీర్థావాహన చేసి అమర్చిన 1008 కళశాలలోని ద్రవ్యాలను వేద పండితులు అమ్మవారి శిరస్సు పైనుంచి ధారగా అభిషేకించారు. కంచనకుంట్ల శ్రీధర్‌రెడ్డి, కీర్తి దంపతులు సహస్రకలశాభిషేకం దాతలుగా వ్యవహరించారు. అనంతరం అమ్మవారిని కాళీక్రమంలో అలంకరించారు. రాత్రి కామేశ్వరీనిత్యాక్రమంలో ఆవరణార్చనలు, సాయంతనపూజ, నీరాజనమంత్రపుష్పం, తీర్థప్రసాదవితరణ జరిపారు. ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఫోర్జరీ కాగితాలతో పట్టా పాస్‌బుక్‌లు

- సాదా బైనామా ద్వారా రిజిస్ట్రేషన్
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు.. కేసు నమోదు

హసన్‌పర్తి: ఫోర్జరీ కాగితాలు సృష్టించి పట్టాపాస్ బుక్‌లు పొందిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరాడు. ఈమేరకు శనివారం బాధితుడు బండా ప్రదీప్‌రెడ్డి హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. హసన్‌పర్తి మండలం అన్నాసాగరంలో 404 సర్వే నంబర్‌లోని శివానీ స్ప్రింగ్ మిల్లు లిమిటెడ్ కంపెనీ (హరిదాస్ నర్సయ్య పేరిట) సుమారు 1.20 ఎకరం భూమి ఉంది. ఈభూమిని 13 ఏళ్ల క్రితం అన్నాసాగరం గ్రామానికి చెందిన బండా ప్రదీప్‌రెడ్డి రూ.15 లక్షలకు ఖరీదు చేశాడు. ఇందుకు రూ.14.50 లక్షలు చెల్లించాడు. ఆర్థిక పరిస్థితుల కారణంగా రిజిస్ట్రేషన్ చేసుకోలేదు.

సాదా బైనామా పేరిట రిజిస్ట్రేషన్

ఇదిలా ఉండగా.. ఇటీవల బండా ప్రదీప్‌రెడ్డి రిజిస్ట్రేషన్ కోసం రెవెన్యూ కార్యాలయానికి వెళ్లాడు. తీరా ధరిణి పోర్టల్‌లో పరిశీలించగా, సింగిరెడ్డి రవీందర్ రెడ్డి పేరున పట్టాపాస్ పుస్తకం జారీ చేసినట్లుగా ఉందని గుర్తించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

ఆర్టీఐ ద్వారా సమాచారం..

ఆర్‌టీఐ ద్వారా ప్రదీప్‌రెడ్డి సమాచారాన్ని సేకరించారు. సింగిరెడ్డి శ్రీలత, సింగిరెడ్డి లక్ష్మారెడ్డి సాదా బైనామా ద్వారా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందినట్లు ఆర్టీఐలో పేర్కొన్నారు. శివానీ స్ప్రింగ్ మిల్లు లిమిటెడ్ కంపెనీ (హరిదాస్ నర్సయ్య పేరిట) సాదా బైనామా పత్రాన్ని ఫోర్జరీ చేసి పాస్ పుస్తకం పొందారని ప్రదీప్‌రెడ్డి ఆఫిర్యాదులో వివరించాడు. ఆతర్వాత ఆ భూమిని హనుమకొండ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఎడవోయిన సుమలత సేల్ డీడ్ చేసినట్లు నమోదై ఉంది. ఇలా ఉండగా, ఈ భూమిపైకి వస్తే చంపుతానని శ్రీలత ఆమె భర్త లక్ష్మారెడ్డి, సింగిరెడ్డి రవీందర్‌రెడ్డి బెదిరింపులకు గురి చేస్తున్నారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. కాగితాలపై ఫోర్జరీ సంతకాలు సృష్టించి భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్న సింగిరెడ్డి శ్రీలత, ఆమె భర్త లక్ష్మారెడ్డి, ఎడబోయిన సుమలత, ఆమె భర్త భూపతిరెడ్డితో పాటు మరో వ్యక్తి సింగిరెడ్డి రవీందర్‌రెడ్డిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ సురేశ్ తెలిపారు.

సహకార సంఘాలతోనే పురోగతి

- టీఎస్ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంకు చైర్మన్ మార్నేని రవీందర్ రావు

హన్మకొండ: సహకార సంఘాల ద్వారా ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ పురోగతి సాధించవచ్చని తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు అన్నారు. శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని వరంగల్ డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో అంతర్జాతీయ సహకార దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మార్నేని రవీందర్ రావు ప్రారంభించి మాట్లాడారు. సహకార సంస్థల ద్వారా ప్రపంచ వ్యాప్తంగా 280 మిలియన్ల మందికి ఉపాధి లభిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీసీసీబీ సీఈఓ వజీర్ సుల్తాన్, డైరెక్టర్లు రమేశ్, మురళీధర్, రవి రాజా, పులిపాక శ్రీనివాస్, సాంపల్లి నర్సింహారావు, కాకతీయ సహకార ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ యాకుబ్, అధ్యాపకుడు రాజయ్య, డీసీసీబీ జీఎం ఉషశ్రీ, డీజీఎం అశోక్, ఏజీఎంలు మధుసూదన్, గంప స్రవంతి, గొట్టం స్రవంతి, కృష్ణమోహన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మార్నేని రవీందర్ రావు

రుణాలు వసూలు చేయాలి

ప్రాథమిక సహకార సంఘాలు, డీసీసీబీ బ్రాంచ్‌ల ద్వారా ఇచ్చిన అన్ని రకాల రుణాలను వసూలు చేయాలని టీఎస్ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంకు, వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు ఆదేశించారు. శనివారం డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో బ్రాంచ్ మేనేజర్లు, ప్రాథమిక సహకార సంఘాల సీఈఓలతో సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న కర్షకమిత్ర, ఎల్‌టీ, పీటీఎల్, డెయిరీ, షీప్, ట్రాక్టర్, హార్వెస్టర్, జేఎల్‌జీ, మార్టిగేజ్ రుణాలు రికవరీ చేయాలన్నారు. రికవరీ కానీ రుణాలను లీగల్ యాక్షన్ ద్వారా వసూలు చేయాలన్నారు. డిపాజిట్ల టార్గెట్ సాధించి బ్యాంకు అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

కన్స్యూమర్ రిసెప్షన్ డెస్క్‌ల ఏర్పాటు

హన్మకొండ: వినియోగదారుల సమస్యల పరిష్కరించేందుకు, ఫిర్యాదుల స్థితిని ట్రాక్ చేయడానికి ఎన్పీడీసీఎల్ పరిధిలోని అన్ని సర్కిల్‌లు, డివిజన్, సబ్ డివిజన్, సెక్షన్ కార్యాలయాల్లో కన్స్యూమర్ రిసెప్షన్ డెస్క్ ఏర్పాటు చేస్తున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి ఎస్ఈ, డీఈ, ఏడీఈ, ఏఈలు, ఎస్ఏఓ, ఏఏఓలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కన్స్యూమర్ రిసెప్షన్ డెస్క్‌ల ద్వారా ఫిర్యాదులు విశ్లేషించుకోవచ్చన్నారు. ఒక వేళ వినియోగదారుడు ఫిర్యాదుపై సంతృప్తి చెందకపోతే ఆ ఫిర్యాదు పునరావృతం అవుతుందన్నారు. ఈ ఫిర్యాదులను సంబంధిత ఎస్ఈ, డీఈ, ఏడీఈ, కార్పొరేట్ కార్యాలయం నుంచి పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. అన్ని సర్కిళ్లలో విద్యుత్ బిల్లులపై క్యూ ఆర్ కోడ్ ముద్రించి వచ్చే నెల నుంచి జారీ చేయనున్నట్లు వెల్లడించారు. ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్ లాల్, వి.తిరుపతి రెడ్డి, టి.మధుసూదన్, సీజీఎంలు కె.రాజుచౌహాన్, కె.తిరుమల్ రావు, కె.ఎస్.గుట్ట, కిషన్, జీఎంలు గౌతమ్ రెడ్డి, దేవేందర్, కృష్ణ మోహన్, మల్లికార్జున్, నాగ ప్రసాద్, శ్రీనివాస్, శేషారావు, డీఈ ఐటీ కె.అనిల్ కుమార్, డీఈ టీ.శ్రీధరాచారి పాల్గొన్నారు.